విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 04, జనవరి 2025

## సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**విశాలాంధ్ర - నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలోని ఏఐటియుసి అనుబంధ యూనియన్ లారీ లోడింగ్ అన్ లోడింగ్ హామలి వర్కర్స్ కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురాంమూర్తి సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహానంది, మరియు కార్మిక వర్గం సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహానంది ఏఐటియుసి కార్మికులు సంజన, వెంకటరమణ, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నవంగలిలో ఉద్రిక్తత

- వైసీపీ నాయకులకు వత్తాసు పలికిన పోలీసు అధికారులు
- ఆందోళన చేసిన టీడీపీ నాయకులు
- వాయిదాపడ్డ ఎన్నికలు

**విశాలాంధ్ర - చాగలమర్రి :** మండలంలోని చిన్నవంగలి గ్రామంలోని పాల డైరీ ఎన్నికల్లో భాగంగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.స్థానిక పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారం మొదలైంది.టిడిపి నాయకులు ఇద్దరు నామినేషన్లు వేయగా వైసీపీ నేతలు మరో ఇద్దరు నామినేషన్లు దాఖలు చేసేందుకు కేంద్రం వద్ద కు వచ్చారు.దీంతో కొద్ది మేర ఘర్షణ వాతావరణం నెలకొంది.అక్కడ ఉన్న పోలీసులు ఇరు వర్గాల వారిని పంపించే ప్రయత్నం చేశారు.ఇదిలా ఉండగా నామినేషన్ల ప్రక్రియలో వైసీపీ నాయకులకు పోలీసులు వత్తాసు పలుకుతూ వారికి మద్దతుగా నిలువడమేమిటని టిడిపి నాయకులు గట్టిగా ప్రశ్నించారు. ఆళ్ళగడ్డ రూరల్ సిఐ కంబగిరి రాముడు,కోవెలకుంట్ల సిఐ హనుమంత్ నాయక్,పోలీసులు ఇక్కడ ఎవ్వరూ ఉండకూడదంటూ టిడిపి నాయకులను వెళ్ళగొట్టే ప్రయత్నం చేశారు.ఇంతలోనే అక్కడికి చేరుకున్న టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహా రెడ్డి తమ పార్టీ శ్రేణులను ఎందుకు వెళ్ళగొడుతున్నారంటూ,మీరేమైన వైసీపీ ప్రభుత్వంలో పని చేస్తున్నారా అంటూ ఎన్నికల కేంద్రం వద్దకు చేరుకోగా మండల కన్వీనర్,టిడిపి నాయకులను పోలీసులు బయటకు లాగారు.ఈ ఘటనలో మండల కన్వీనర్ లాయర్ నరసింహా రెడ్డి,స్థానిక టిడిపి నాయకులు అనీల్ కుమార్ రెడ్డి బట్టలు చిరిగాయి.వెంటనే అర్ధనగ్నంగా కూర్చొని సిఐ డౌన్‌డౌన్ అంటూ ఆందోళన చేసారు.స్థానిక ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రంలో ఓవైపు చినిగిన నామినేషన్ పత్రాలు,మరోవైపు శాంతి,భద్రతల దృష్ట్యా ఎన్నికలను వాయిదా వేసారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భారిగా పోలీస్ బలగాలు మొహరించాయి.

### నదుల అనుసంధానంపై

## ప్రజా సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** నదుల అనుసంధానంపై ప్రజా సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవా లని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఎఐకెఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న పేర్కొన్నారు. శుక్రవారం సిపిఐ నంద్యాల జిల్లా కార్యాలయంలో అయన మాట్లాడుతూ కృష్ణా జలాల సద్వినియోగానికి ప్రాజెక్టుల అసంపూర్ణ మౌలిక నిర్మాణాలను పూర్తి చెయ్యడానికి అంత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక పర్యా వరణ పరిరక్షణ కమీషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలను కృష్ణా నదికి మళ్ళించి నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకు నీరందించాలన్న ముఖ్యమంత్రి ప్రకటనను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కృష్ణా జలాల నీటి లభ్యత వున్నప్పటికీ రాష్ట్ర విభజన చట్టంలో అనుమతించిన తెలుగుగంగ, గాలేరు -నగరి, హంద్రీ - నీవా, వెలుగొండ ప్రాజెక్టుల మౌలిక నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వలన, శ్రీశైలం రిజర్వాయర్ విధి విధానాలను సక్రమంగా అమలు పరచకపోవడం వల్ల ఆయకట్టుకు నీరందని పరిస్థితిపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. రాయలసీమలో సాంప్రదాయక సాగునీటి వనరులైన చెరువుల పరిరక్షణ చేపడుతూనే పెన్నా, దాని ఉపనదుల పునరుజ్జీవం కోసం పర్యావరణ పరిరక్షణ కమీషన్ ఏర్పాటు చేయాలని, ప్రతి ఎకరాకు నీరందించి, రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించి, సంపద సృష్టించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టే దశలో ప్రజా సంఘాల సూచనలు, అభిప్రాయాలను వెల్లడించదానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పునరాలోచన చేయాలని సోమన్న పేర్కొన్నారు.

## సంక్రాంతిలోగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలి

**విశాలాంధ్ర - బనగానపల్లె :** బనగానపల్లెలో సంక్రాంతిలోగా సంపూర్ణంగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని పంతం పట్టిన బీసీ ఇందిర రెడ్డి ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా బనగానపల్లెలో ప్లాస్టిక్ కవర్లతో వెళుతున్న స్థానిక మహిళలు, పంచాయతీ సిబ్బందిని ఆపి బీసీ ఇందిర రెడ్డి వారి నుంచి ప్లాస్టిక్ కవర్లను తీసివేయించి,వాటికి బదులుగా స్వయంగా భూమిలో కరిగిపోయే బయోడిగ్రేడ్ కవర్లను అందజేసి ఇక నుంచి ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని బనగానపల్లెను ప్లాస్టిక్ రహితంగా, తీర్చదానికి సహకరించాలని కోరారు.

## సావిత్రిబాయి పూలే అడుగు జాడల్లో నడుద్దాం

**విశాలాంధ్ర - జూపాడుబంగ్లా :** సావిత్రిబాయి పూలేను మహిళలు,

విద్యార్థినీలు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, వారి అడుగుజా డల్లో నడిచి సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపాలని, మహిళలపై జరుగుచున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ యశోద విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రం లోని స్థానిక కేజీబీవీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే 194 వ జయంతిని విద్యార్థులు పూలమాలలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం వ్యాస రచన పోటిలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినీలకు సీపీఐ జిల్లా నాయకులు ఏం.రమేష్ బాబు బహుమతులు అందజేసి వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## ఐఏఎల్ క్యాలెండర్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ :** నంద్యాలలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ ఏ ఎల్) క్యాలెండర్ ను ఆవిష్కరించారు. నంద్యాల బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షులు రావినూతల దుర్గాప్రసాద్ న్యాయవాదులతో కలిసి క్యాలెండర్ మరియు డైరీ ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ భూపని వెంకటేశ్వర్లు, ఐఏఎల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈసీ మెంబెర్ యం శ్రీనివాసులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## డిఎస్పి ప్రమోషన్లలో సిఐలకు అన్యాయమా..!

**విశాలాంధ్ర - డోన్ :** డి ఏస్పి ప్రమోషన్లలో రాయల సీమ సిఐ లకు అన్యాయం చేయెుద్దు రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా (ఆర్పీఐ)పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు హుసేనప్పమాదిగ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హత వున్న సిఐలకు డిఎస్పీలుగా ప్రమోషన్‌లు కలిపిస్తున్న సందర్భంగా రాయలసీమ ప్రాంతంలో ఉన్న 1996 బ్యాచ్ సిఐలకు కాకుండా 2003 బ్యాచ్‌లకు ఇవ్వడమేమిటన్నారు. అదేవిదంగా ఎస్సి, ఎస్టీలకు రోస్టర్ ప్రకారం ప్రమోషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల వారికి అర్హత ప్రకారం ప్రమోషన్‌లు ఇవ్వాలని రాయలసీమను వ్యక్తులను బలిపశువును చేయెుద్దని విజ్ఞప్తి చేశారు.

## విద్యా కమిటీ చైర్మన్‌లకు శిక్షణ

**విశాలాంధ్ర - శిరివెళ్ల :** మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాలల ఎస్ఎంసి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ లకు ఏపీ మోడల్ స్కూల్లో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు డిటి శంకర్ ప్రసాద్, నాగార్జున రెడ్డిలు పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల నైపుణ్యాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యత ప్రమాణాలు,, మరియు బడికిరాని విద్యార్థుల పట్ల విద్యా కమిటీల బాధ్యతల గురించి వివరించడమైనదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## కెవి సుబ్బారెడ్డిలో జాబ్ మేళా

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి కళాశాలలో నేడు అనగా శనివారం నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించనున్నారు . ఐటీ, బ్యాంకింగ్, బిపిఓ, ఎడుటెక్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఆఫ్ క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పోస్ట్ గ్రాడ్యుయేట్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ అలాగే బిటెక్, బీఎస్సీ, బి బి ఏ, బి సి ఎ, బి ఈ అర్హత కలిగిన నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. డిగ్రీ ఫ్రెషర్స్‌కు అవకాశం కల్పిస్తామని వారు పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన వారికి 2 లక్షల నుండి 9 లక్షల వరకు వేతనం పొందవచ్చున్నారు. అలాగే ఫైనల్ ఇయర్ మరియు ఫ్రెషర్స్‌కు ఇంటర్న్‌షిప్ ద్వారా నెలకు 25 వేల రూపాయలు, అదనపు అలవెన్స్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## దళితులకు న్యాయం చేయండి

**విశాలాంధ్ర - బండి ఆత్మకూర్ :** మండల కేంద్రంలోని తాసిల్దార్ మండలంలోని అన్ని గ్రామాలకు గతంలో కుల గణన జరిపించిన్నారు వాటిలో ఎస్సీలు 59 కులాలు ఉన్నారు కొన్ని గ్రామాలలో ఎస్సీలలోనే మాదాసి కురువ ఎస్సీ జాబితాలో చేర్చడం జరిగింది వారిని విచారించి మాకు ఎస్సీ మాదిగలకు న్యాయం చేయవలసిందిగా కోరుచున్నాము శివకుమార్. పూల వెంకట సుబ్బన్న. బాలస్వామి దశరథుడు తదితరులు పాల్గొన్నారు

### సున్నానికి నోచుకోని పాఠశాల

# అదిగో, ఇదిగో అంటున్న కాంట్రాక్టర్లు

**విశాలాంధ్ర - రుద్రవరం :** మండలంలోని నక్కల దీన్నే గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల నాడు నేడు కింద ఎంపికై చివరకు పాఠశాల సున్నానికి నోచుకోలేని దుస్థితికి చేరిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల రూపురేఖలను మార్చేందుకు గతంలో ప్రభుత్వం లక్షలాది రూపాయలను మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాలకు అవసరమైన చిన్న చిన్న పనులను, పెద్ద పెద్ద పనులను చేసి పాఠశాలకు త్రాగునీటి వసతిని ఇలా పాఠశాలకు 8 రకాల పనులను చేయాల్సి ఉంది. పెద్ద పెద్ద పనుల సంగతి దేవుడెరుగు చిన్న పని పాఠశాల అందానికి ప్రధానమైన సున్నము, రంగులను వేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తరగతి గది వర్షపు నీరు కారుతుందని పాత స్లాప్ తీసవేసి కొత్త స్లాపు వేసి తరగతి గోడలకు సిమెంట్ పూతను పూశారు. ఏడాది కాలం దాటిన కూడా ఇంతవరకు పాఠశాలకు రంగులు కాదు కదా కనీసం సున్నాన్ని కూడా వేయలేదు. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు సిమెంట్ వాసనతో ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయల నిధులను మంజూరు చేసిననిధులను మాత్రం పూర్తిగా వాడినప్పటికీ పనులను మాత్రం మిగిలించారు. గ్రామానికి మంచి నీటిని సరఫరా చేసే పైపు నుండి విద్యార్థులకు త్రాగునీటిని అందించేందుకు ఒక నీటి ట్యాంకును ఏర్పాటు చేసి దానిలోకి మంచినీటిని సరఫరా చేసి ఆ నీటిని విద్యార్థులు తాగుతున్నారు. ఆ నీటి ట్యాంకును శుభ్రం చేసేది ఎవరో తెలియక అయోమయంలో పడుతున్నామని గ్రామస్తులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు సున్నాన్ని, రంగులను వేయించి పాఠశాల రూపురేఖలను మార్చి విద్యార్థుల ఆరోగ్యాలను కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### కాంట్రాక్టర్లు మాత్రమే పనులను చేయాలి

**పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధు..**

పాఠశాలకు సున్నాన్ని పూసి, రంగులు వేసే బాధ్యతను కాంట్రాక్టర్లు మాత్రమే చేయాలి, ఏడాది నుండి కాంట్రాక్టర్లను అడుగుతూనే ఉన్నాము అదిగో ఇదిగో వస్తున్నాము అంటున్నారే తప్ప ఇంతవరకు రాలేదు.

## ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం విడాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా..

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద వేతనదారులకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి ఏపిడి, ఏపీఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి జనార్ధన్ రావు, పశుసంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ కింద వేతనదారులకు పనులు కల్పించడంలో ఏపీడి, ఏపీవోలు నిర్లక్ష్యం చేస్తున్నారని పనితీరు మెరుగుపరుచుకుని నిర్దేశించిన పనుల్లో లక్ష్యాన్ని సాధించడంలో ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. లేబర్ బడ్జెట్ కింద వేతనదారులకు వంద రోజులు పని దినాలు కల్పించడంలో పూర్తిగా వెనుకబడి ఉన్నారన్నారు. జిల్లాలో 2.3 లక్షల మంది వేతనదారులు ఉంటే కేవలం 3000 మందికి మాత్రమే వందరోజుల పని దినాలు కల్పించడం నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. జిల్లాలో 6.72 లక్షల హౌసింగ్ మ్యాన్డేస్ ఉన్నప్పటికీ పనులు కల్పించలేకపోయారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధ్వాన రీతిలో ప్రగతి చూపిన అధికారుల ఫైళ్ళను సర్క్యులేట్ చేయాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. పనులు కల్పించే అవకాశాలున్నచోట కూడా పనులు కల్పించడంలో అశ్రద్ధ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ బడ్జెట్, సరాసరి దినసరి వేతన కూలీ, గోకులం షెడ్లు తదితర అంశాలలో దిగువ స్థానంలో ప్రగతి ఉండడంపై సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశ్నిస్తూ నిర్దేశించిన పనులన్నింటినీ మార్చి 31 లోగా పూర్తిస్థాయిలో చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## మిట్టపల్లి గ్రామంలో రెవిన్యూ సదస్సు

**విశాలాంధ్ర - బనగానపల్లె :** మండల పరిధిలోని మిట్టపల్లె, కాపులపల్లె గ్రామంలో రెవిన్యూ అధికారులు రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేర్ గాయత్రి, వీఆర్వో మధు, గ్రామ సర్వేర్ తనుజ, సర్వే ర్ మురళి గ్రామ ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. త్వరలో వాటిని పరిష్కరిస్తామని అధికారులు గ్రామ ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడమకంటి తులసి రెడ్డి,మహానంద రెడ్డి, చిన్నన్న (వెంకటేశ్వర్ రెడ్డి), శెషి రెడ్డి, కుందం వెంకటసుబ్బారెడ్డి , కుళాయి రెడ్డి,రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల గోస వినండి

> రాంకో విస్తరణను ఆహ్వానిస్తున్నామన్న నాయకులు
> పంట నష్టం, ఉపాధి, ఉద్యోలకల్పనపై ప్రజలు పట్టు
> పోలీస్ నీడలో ప్రజాభిప్రాయ సేకరణ సభ

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :** రాంకో సిమెంట్, క్లింకర్ ఉత్పత్తుల పెంపు విస్తరణ సమ్మతమే కానీ భూములు ఇచ్చిన తమ గోష కూడా పట్టించుకోవాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేశారు. రాంకో చుట్టుపక్కల కాలుష్యంతో పంటలను సాగు చేసి నష్టపోతున్నామని రాంకో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు ఉపాధి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. శుక్రవారం మండలంలోని కలవటాల గ్రామ సమీపంలో రాంకో సిమెంట్ పరిశ్రమ ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణం పై ప్రజాభిప్రాయ సేకరణ బహిరంగ సభను నంద్యాల జెసి విష్ణు చరణ్ అధ్యక్షతన నిర్వహించారు. రాంకో పరిశ్రమ సిమెంట్, క్లింకర్, వేస్ట్ హీట్ రికవరీ పవర్ ప్లాంట్ ఉత్పత్తి పెంపుపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభను నిర్వహించారు. రాంకో ఉత్పత్తి పెంపు విస్తరణ సమ్మతమే కానీ యాజమాన్యం రైతులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు. భూములు ఇచ్చిన రైతు కుటుంబాలలో చదువుకున్న వారికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలన్నారు. పొలాలు కోల్పోవడంతో చాలామంది ప్రజలు ఉపాధి కోల్పోయారని రైతు మహిళ కూలీలు ఇతర మండలాలలో వ్యవసాయ పనులకు వెళుతున్నారని తెలిపారు. కలవటాల గ్రామ అభివృద్ధికి రాంకో కృషి చేయాలని ఆ గ్రామ సర్పంచ్ కె సుమలత కోరారు.రామ్కో అధ్వర్యంలో సిబిఎస్ ఇ బోధించే స్కూల్, హాస్పిటల్, కొలిమిగుండ్ల లో పార్క్ ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. రాంకో బ్లాస్టింగ్ వలన చింతలాయిపల్లి తదితర గ్రామాలలో ఇండ్లు దెబ్బతింటున్నాయని, సాగు చేస్తున్న చుట్టుపక్కల భూములలో కాలుష్యంతో నిండిపోతున్నాయని, రైతుల భూములు కొన్నాడమా లేదా పంట నష్టపరిహారం రాంకో చెల్లించేలా చూడాలని టిడిపి మండల అధ్యక్షులు మూలే రామేశ్వర్ రెడ్డి కోరారు. భూములు ఇచ్చిన రైతులు దిక్కు తెలియని స్థితిలో ఉన్నారని కాలుష్యం మైనింగ్ శబ్దాల వల్ల భయాందోళన చెందుతున్నారని రాంకో యజమాన్యం రైతుల సమ్మతం లేకుండా ప్రిజం భూములను ఎలా కొనుగోలు చేస్తుందని, ప్రిజం యాజమాన్యం రైతులకు ఎన్నో హామీలు ఇచ్చిందని కొందరు రైతులు తెలిపారు. పరిశ్రమల తోనే అభివృద్ధి జరుగుతుందని, అందులో భూములు ఇచ్చిన రైతుల అభివృద్ధిని కూడా పట్టించుకోవాలని జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి కోరారు. నూతన టెక్నాలజీతో కాలుష్య రహితనికి యజమాన్యం కృషి చేయాలన్నారు. ఆళ్లగడ్డ డి.ఎస్.పి రవికుమార్ ఆధ్వర్యంలో సిఐ రమేష్ బాబు,పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కర్నూల్ కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్, తహసిల్దార్ బాలిశ్వర రెడ్డి, టిడిపి నాయకులు వీఆర్ లక్ష్మిరెడ్డి, జయలక్ష్మి రెడ్డి, గూడూరు నాగేశ్వర్ రెడ్డి, కృష్ణ రంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు పులి ప్రకాష్ రెడ్డి, వైసిపి నాయకులు పేరం సత్యనారాయణ రెడ్డి, సర్పంచులు లాయర్ మహేశ్వర్ రెడ్డి, గురివిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఎస్వీ కృష్ణారెడ్డి, కలవటాల, కోటపాడు, కొలిమిగుండ్ల, గ్రామాల ప్రజలు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సృజనాత్మకత కలిగి ఉండాలి

**విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ :** విద్యార్థులు చదువును విశ్లేషణాత్మకంగా, ప్రయోగాత్మకంగా తెలుసుకుని విద్యనభ్యసిస్తే ఉన్నత స్థితిలో రాణించగలుగుతారని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎస్పిజి పాఠశాలలో జిల్లా స్థాయి సదరన్ సైన్స్ ఫెర్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడ ుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను కంఠస్థం చేసే రీతిలో కాకుండా విశ్లేషణాత్మకంగా,ప్రయోగా త్మకంగా తెలుసుకొని విద్యనభ్యసిస్తే ఉన్నత స్థితికి చేరుకోవడమే కాకుండా నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారన్నారు. పాఠశాలలో నిర్వహించే వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, సైన్స్ ఫెయిర్ లాంటి పోటీ అంశాలలో విద్యార్థులందరూ భాగస్వాములై సృజనాత్మకతను పెంపొందించుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ ఉద్బోధించారు. విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న వార్షిక పాఠ్యాంశాలతో పాటు అదనపు కరికులాన్ని పెంపొందించుకుంటే పోటీ పరీక్షల్లో నెగ్గుకొచ్చే సామర్థ్యం కలిగి ఉంటారన్నారు. విద్యార్థులు ఖాళీ సమయాల్లో మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా ఎల్లప్పుడూ మెదడుకు పని పెడుతూ మేధస్సును సంపత్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతికూల ఆలోచనలను పక్కనపెట్టి అనుకూల దృక్పథాన్ని అలవర్చుకొని తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరితో క్రమశిక్షణతో మెలగా లన్నారు. చదువుతోపాటు ఆటపాటలు, ఏదో ఒక లైఫ్ స్కిల్ కచ్చితంగా కలిగి ఉండాలన్నారు. తాను చిన్నప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సా హంతో అన్ని పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్లే కలెక్టర్ స్థాయికి ఎదగలిగానని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి సైన్స్ ఫెర్ లలో పాల్గొంటే భవిష్య త్తులో జరిగే పోటీ పరీక్షలకు మంచి పునాదిగా ఉంటుందన్నారు. ఇలాంటి అవకాశాలను అందిపు చ్చుకొని విద్యార్థులు ప్రతి పోటీ అంశంలో పాల్గొనే ందుకు ఉత్సాహం చూపాలన్నారు. డీఈఓ జనార్ధన్ రెడ్డి, సమగ్ర శిక్షఅభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :** పాఠశాలలలో మౌలిక సౌకర్యాలు అభివృద్ధిపై ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల యజమాని కమిటీలు దృష్టి సారించాలని ఎంఈఓ లు రాజయ్య, అబ్దుల్ కలాం లో కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం నందు ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీలు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్ విశ్వేశ్వర ప్రసాద్, లక్ష్మణులు ఎస్ఎంసి, ప్రధానోపాధ్యాయుల బాధ్యతలు విధులను వివరించారు. కమిటీ సమావేశాల నిర్వహణ రిజిస్టర్లు నిమిషాలు తీర్మానాలను చర్చించుకోవాలన్నారు. అభ్యసన ఫలితాలలో ప్రగతి సాధించేలా, 100% బడి వయసు పిల్లలు పాఠశాలలో ఉండేలా చూడాలన్నారు. ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చే నిధులతో పాటు దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు మన ఊరు మనబడి అనుకుని పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి కమిటీలు ముందుండాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పరిశీలించాలని, ఏకరూప దుస్తులు పుస్తకాలు అందేలా కమిటీలు చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యజమాని కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



**విశాలాంధ్ర-డోన్ :** సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడిచి సమాజ శ్రేయస్సుకు కృషి చేద్దామని ఏపీ మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షమీం బేగం, మండల కార్యదర్శి అమృత రెడ్డి అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని నక్కి రామన్న భవన్‌లో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళాలోకానికి ఆదర్శవంతమని,ఉపాధ్యాయురాలిగా సమాజ శ్రేయస్సు కోసం కృషి చేశారన్నారు. సమాజంలో మహిళల పట్ల వివక్షతను పోగొట్టేలా ఆమె పోరాటం చేశారని, అందరు కూడా ఆమె స్ఫూర్తితో ఆమె అడుగు జాడల్లో నేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో అసమానతలు పోగొట్టేలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళ సమాఖ్య పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మాధవి, సీరిన్, షబానా, మాధవిలత, సూర్య పద్మావతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## ఏపి ఎన్జీజీవో అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్:** ఏపి ఎన్జీజీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను శుక్రవారం పట్టణంలోని డిఎస్పి కార్యాలయంలో ఆత్మకూరు డిఎస్పి రామాంజీనాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీజీవో అసోసియేషన్ ఆత్మకూరు తాలూకా అధ్యక్షులు మోహన్ రెడ్డి, కార్యదర్శి సాజిద్ బాషా, ఉపాధ్యక్షులు ఫక్రుద్దీన్, సహాయ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

## అయ్యో పాపం... అనాధలుగా పసిపిల్లలు

34శాలాంధ్ర - ఆదోని రూరల్: తల్లిదండ్రులను కోల్పోయి పసిపిల్లలు అనాధలుగా మిగిలిన సంఘటన మండలంలోని పాండవగల్ గ్రామంలో చోటుచేసుకుంది. 2015లోనే తల్లి మృతితో జీర్ణించుకోలేని సంఘటనను మరవకముందే విధి వెక్కిరిస్తూ తండ్రి గుండెపోటుతో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తల్లిదండ్రులను కోల్పోయిన నలుగురు పిల్లలకు దిక్కు ఎవరంటూ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఉదయం ఎల్లగౌని ఆంజనయ్య ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పనులకు వెళ్లి అక్కడే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. 2015లోనే భార్యను కోల్పోయిన అంజనేయ ముగ్గురు ఆడ కూతుర్లను, ఒక కుమారుడి బాగోగులు చూసుకుంటూ పొలం పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆంజనేయకు నలుగురు పిల్లలు సంతానము పెద్ద కూతురు మైత్రీకి వివాహం చేయగా, రెండో కుమార్తె మల్లేశ్వరి హెూళగుందలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతుందని, మూడో కుమార్తె తాయమ్మ ఇంటి దగ్గరే ఉంటూ ఇంటి పనులు చేసుకునేది. ఆడపిల్లల కంటే చిన్నవాడైన నాలుగో కుమారుడు శివ కౌతాళం మండలం ఎరిగేరి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు మృతి దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనాధలుగా మిగిలిన ముక్కుపచ్చలారని పసి పిల్లలను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే రూ.20లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిల్లల చదువుకయ్యే ఖర్చులను ప్రభుత్వం భరించాలని కోరారు.

**మృతదేహాన్ని సందర్శించిన ఎంపీడీవో:** ఎల్లగౌని అంజనేయ గుండె పోటుతో మృతి చెందిన సంఘటన తెలుసుకున్న ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని సందర్శించి, అనాధలుగా మిగిలిన పిల్లలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఇంటిస్థలం ఇచ్చి రూ.5 లక్షలు మంజూరు చేయాలి : బి గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సొంత ఇండ్లులేని పేదలకు ప్రభుత్వం పట్టణాల్లో రెండుసెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలంతోపాటు నిర్మాణంకు 5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లాకార్యదర్శి బి గిడ్డయ్య డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం నగరంలని ధర్నాచౌక్ వద్ద సీపీఐ నగర సమితి ఆద్వర్యంలో రిలేనిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నగర సహాయకార్యదర్శి సి.మహేష్ అధ్యక్షత వహించారు. ముందుగా రిలేనిరాహాదీక్షలను గిడ్డయ్య ప్రారంభించారు. ఈదీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల నివాస్థలం ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికలలో విజయం సాధించి 6 మాసాలు అయినా నేటి వరకు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇంటిస్థలంలోపాటు నిర్మాణం కోసం 5లక్షలు మంజూరు చేసి ఇనుము, ఇసుక, సిమెంట్ ఫ్రీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఫ్లైహోవర్ బిడ్జీలు నిర్మాణం చేయాలని వేసవిలో పట్టణ ప్రజల దాహర్తి తీర్చేందుకు రెండవ సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలన్నారు.నగరంలో అండర్‌డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, హంద్రీనివా పరివాహక ప్రాంతాల్లో ప్రహరీగోడల నిర్మాణం చేపట్టాలన్నారు. పేద మధ్యతరగతి వారికి విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కర్నూలునగరంలో పేదలు ఆక్రమించుకొని వేసుకున్న కొట్టాలకు వెంటనే పట్టాలు ఇచ్చి గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కర్నూలునగరంలో అద్దెలు చెల్లించలేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదలు ఆక్రమించుకొని గుడిసెలు వేసుకున్న స్థలాల్లో వారికి పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం 5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు కె నాగరాజు, బీసన్న, ఈశ్వర్, ఏఐటీయూసీ నగర అధ్యక్షకార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షకార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, నగర కార్యదర్శి భారతి , నల్లన్న, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శ కె శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు శరత్, అభి ధనలక్ష్మిలు పాల్గొన్నారు. మొదటి రోజు దీక్షల్లో కుమార్‌రాజు, క్రిష్ణ, రవి, లక్ష్మీ, అశోక్, శేఖర్, ఏసన్న తదితరులు కూర్చున్నారు.

## హామీ ఇచ్చి మాట తప్పుతున్న ఎన్డీఏ ప్రభుత్వం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : తాము అధికారంలోకి వస్తే ప్రతి బిడ్డకు రూ. 15వేలు తల్లివందనం పేరుతో ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చే ఎనిమిది నెలల గడుస్తా ఉన్న హామీని గాలికి వదిలేశారని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, అబ్దుల్ ఖాదర్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ ముఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు తల్లికి వందనంపైన రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. మద్యం దుకాణాల టెండర్లపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థులపైన లేదన్నారు. అధికారంలోకి రావడానికి తమకు ఇష్టం వచ్చినట్టు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత హామీలు అమలు చేయలేమంటే విద్యార్థుల పక్షాన చూస్తూ ఊరుకోమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు సమీర్, వీరేష్, సంతోష్, ప్రవీణ్, మోహన్, రవి,గిరి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## వాము క్వింటా గరిష్ట ధర రూ.15916

**విశాలాంధ్ర- జిల్లా పరిషత్, కర్నూలు:** వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం వివిధ రకాల పంట ఉత్పత్తులు వచ్చాయి. 10 మంది రైతులు వచ్చారు. 92 క్వింటాళ్ల వాము తెచ్చారు. క్వింటా కనిష్ట ధర రూ.15518, మధ్యతర రూ.15618, గరిష్ట ధర రూ.15916 పలికింది. వేరుశెనగ గరిష్ట ధర రూ.6411, ఆముదము గరిష్ట ధర రూ.5607, మొక్కజొన్నలు రూ.2329, కంది బ్యాళ్లు రూ.6909, కందులు రూ.7969, ఉల్లిగడ్డలు రూ.2588, ఎండు మిరపకాయలు రూ.16199, కొర్రలు రూ.3109, మినుములు రూ.7962, సజ్జలు రూ.2701 వ్యాపారస్తులు కొనుగోలు చేశారు.

## సావిత్రిబాయి పూలే బ్లాక్‌గా నామకరణం

**విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్:** కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలులో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యారంగంలో ఆమె చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, క్లస్టర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ డివిఆర్ సాయి గోపాల్ కళాశాల హాస్టల్‌లోని ఒక బ్లాకును సావిత్రిబాయి పూలే బ్లాక్‌గా నామకరణం చేశారు. వీసీ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు రిజిస్టర్, క్లస్టర్ విశ్వవిద్యాలయం, డాక్టర్ వివిఎస్ కుమార్ ప్రిన్సిపాల్, కేవీఆర్ మహిళా కళాశాల, సావిత్రిబాయి పూలేకు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించడం జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ టి.సునీత, డాక్టర్ వినీలా, కృష్ణవేణి, సుజాత, కుమారి జయలక్ష్మి, మణికంత పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**విశాలాంధ్ర - ఆదోని:** రేషన్ డీలర్ల రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 5వ తేదీన జరిగే రేషన్ డీలర్ల రాత పరీక్షకు సంబంధించిన పరీక్ష కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని డివిజన్లో 78 డీలర్ల నియామకం కొరకు 512 మంది దరఖాస్తు చేసుకోగా వీటిలో సరైన పత్రాలు లేనందున 45 దరఖాస్తులను రిజెక్ట్ చేయగా 467 దరఖాస్తులకు హాల్ టికెట్ మంజూరు చేయడం జరిగింది అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారి సంబంధిత మండల తాహశీల్దార్ కార్యాలయంలో హాల్ టికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. జనవరి 5వ తేదీన డీలర్ పరీక్ష ఉదయం 10 నుండి 11.30 వరకు నిర్వహించడం జరుగుతుంది. పరీక్షకు హాజరయ్యేవారు 9.30 లోపు పరీక్ష కేంద్రంలో ఉండాలన్నారు. పరీక్షకు ఒరిజినల్ హాల్ టికెట్ మరియు ఆధార్ కార్డు తీసుకు రావాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలైన గడియారం, క్యాలిక్యులేటర్, మొబైల్ ఫోన్స్ అనుమతి లేదన్నారు. రాత పరీక్ష ప ఉత్తీర్ణులైన వారికి 1:5 నిష్పత్తి ప్రకారం ఇంటర్వ్యూ జనవరి 6వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు. డీలర్ పరీక్ష రాసే అభ్యర్థులు నిబంధనలు పాటించాలని సబ్ కలెక్టర్ సూచించారు. పౌరసరఫరాల శాఖ ఉప తాసిల్దార్ వలి భాష, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఖాసీం, విఆర్వో రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు మహిళ మృతి

**విశాలాంధ్ర - తుగ్గలి:** మండల పరిధిలోని రామలింగయ్యపల్లి గ్రామంలో నివసించే మాధవయ్య భార్య అనంతమ్మలు భూమిని గుత్తకు చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. వారు పండించిన కంది పంట చేతికి వచ్చేసరికి గ్రామంలో వ్యవసాయ నిమిత్తం కూలీలు దొరక్క ఇతర జిల్లాల నుండి వచ్చిన కంది పంట కోత కోసే యంత్రాల సహాయంతో కంది పంటను కోత కోస్తూ, కంది గింజల కోసం మిషన్‌లోకి కంది పంటను వేస్తూ ఉండగా అనుకోకుండా అనంతమ్మ కట్టుకున్న చీర మిషన్‌కు చుట్టుకుంది. దీంతో అనంతమ్మ మిషన్‌లోపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతమ్మ మరణం చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యంతం చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు సమాచారం.

## ఘనంగా చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

**విశాలాంధ్ర - కోడుమూరు:** ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఏపీ మోడల్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి విద్యార్థినీలతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బి.రంగస్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని, విద్యార్థులు సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి వీరాంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు మునిస్వామి,కళాశాల విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## రాయి పూడ్చారు.. పేరు రాయడం మరిచారు

విశాలాంధ్ర - హెూళగుంద: మార్లమడకి నుండి హెూళగుందకు రూ.5.34 లక్షలతో అధికారులు కొత్త రోడ్డును నిర్మించారు. అయితే రోడ్డు వెంబడి కిలోమీటర్ల రాయలను పూర్తి ఊరి పేరు, కిలోమీటర్ రాయాల్సిన చోట అధికారులు నిర్లక్ష్యంగా రాయకుండా వదిలేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేదవతి కాజ్వే వద్ద కిలోమీటర్ రాయిని పూడ్చి, తెల్ల రంగును వేసి అలాగే వదిలేశారు. నంబర్ బోర్డు రాయికి ఊరు పేరు, కిలోమీటర్ సంఖ్యను రాస్తే రాకపోకలకు ఎంతో అనుకూలమవుతుందని ప్రజలు కోరుతున్నారు. నిర్మాణానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసిన అధికారులు రాయికి, కిలోమీటర్ సంఖ్య రాయడానికి డబ్బులు ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంతో రాయకుండా వదిలివేశారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నత రోడ్డు రవాణా శాఖాధికారులు చర్యలు తీసుకొని, కిలోమీటర్ నంబర్ బోర్డు రాయిపై ఊరి పేరు, కిలోమీటర్ సంఖ్యను రాయాలని ప్రజలు కోరుతున్నారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు:** నియోజవర్గం శాసనసభ్యులు బీవీ జయ నాగేశ్వర రెడ్డి, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకుల కొరకు గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా నందు బీఎఫ్ఐఎల్, ఫీసన్ ఫైనల్స్ ప్రతినిధులు ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపుగా 38 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు. వీరిలో 10మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

**విశాలాంధ్ర - తుగ్గలి:** మండలం పరిధిలోని చెన్నంపల్లి గ్రామానికి చెందిన వాల్మూరు రాజశేఖర్ (38), సుమలత (35) దంపతులు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే చెన్నంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ సుమలతలు తమ గ్రామంలో ఈ నెలలో దేవర ఉత్సవాలు కోసం కొత్త బట్టలు తెచ్చుకునేందుకు అనంతపురం జిల్లా యాడికికి వెళ్లి నూతన వస్త్రాలు కొనుగోలు చేసి, తిరిగి వస్తుండగా అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు సమీపంలోని 65వ జాతీయ రహదారి వద్ద బొలెరో వాహనం ఢీకొనడంతో భార్య, భర్తలు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన దంపతులకు ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## ఆదర్శనీయం సావిత్రిబాయి పూలు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పత్తికొండ: సావిత్రిబాయి పూలే నేటి ఉపాధ్యాయులకు ఆదర్శనీయం అని ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు పేర్కొన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని జేఎం తాండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని, సమాజంలో స్త్రీలు పురుషులతో పాటు సమానంగా చదువుకోవాలని సావిత్రిబాయి చేసిన కృషి మరువలేని దన్నారు. జేఎం తాండ గ్రామంలో ఇద్దరే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు కళ్యాణి కృషి వల్ల నేడు 40 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలుపగా, ఎమ్మెల్యే ఉపాధ్యాయురాలు కళ్యాణిని సన్మానించి, విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. సావిత్రిబాయి పూలే 194 జయంతి వేడుకలను పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకోవడం జరిగింది.

## గ్రేడ్-2 వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి

**విశాలాంధ్ర - తుగ్గలి:** కర్నూలు జిల్లా లో గ్రేడ్ 2 వీఆర్వోల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.నాగేంద్ర శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సి.నాగేంద్ర మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న గ్రేడ్-2 వీఆర్వోలలో చాలా మందికి వివిధ కారణాలు చూపుతూ వారిని ప్రభుత్వం రెగ్యులర్ చేయలేదన్నారు. వారి సమస్యలను పరిష్కరించి గ్రేడ్-2 వీఆర్వోలను రెగ్యులర్ చేయాలని కోరారు.

## చురుగ్గా మినీ గోకులం షెడ్డు నిర్మాణ పనులు

**విశాలాంధ్ర - హెూళగుంద:** మండలంలో పశువుల ఆరోగ్య రక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నిధులతో మంజూరు చేసిన మినీ గోకులం షెడ్ల నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణానికి సంఖ్యాబలం ఆధారంగ నిధులు మంజూరయ్యాయి. 90 శాతం, 70 శాతం నిధులతో పాటు రైతులు చెల్లించే 10 శాతం నిధులతో గోకులం షెడ్డు పనులను రైతులు నిర్మించుకుంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో మినీ గోకులం షెడ్లు మండలానికి మంజూరు కావడంతో రైతులు సొంతంగా తమ సొంత స్థలంలో నిర్మించుకుంటున్నారు.


మరిన్ని వార్తలు E-PAPERలో....


## కస్టమర్లను వేధిస్తున్న ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** గృహాలను తాకట్టు పెట్టుకొని ఫైనాన్స్ డబ్బులు ఇచ్చి ఒక్క నెల కంతు కట్టకపోయినా తన ఉద్యోగస్తులను ఇంటికి పంపించి కస్టమర్లను ఇబ్బందులకు గురి చేస్తున్న ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ యాజమాన్య పై చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశ్యారు. శుక్రవారం పీ మహిళాసమాఖ్య, ఏఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ బాధితులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బిసన్న అధ్యక్షత వహించారు.ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి, నగర కార్యదర్శి భారతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం సామాన్య ప్రజలకి ఇంటి స్థలాలు ఇంటి పత్రాలను తాకట్టు పెట్టుకుని రుణాలు ఇస్తూ కంతుల రూపంలో వారిని డబ్బులు వసూలు చేస్తుందన్నారు. ఒక్క నెల లేట్ అయిన కంపెనీ యాజమాన్యం రికవరీ ఏజెంట్లను 10, 15 మందిని కస్టమర్ల ఇంటికి పంపించి డబ్బులు కట్టేంతవరకు మీరు రావద్దని మీరు వస్తే మీకు జీతాలు ఇవ్వమని వారి చేత బలవంతంగా కస్టమర్ల ఇండ్లలో కూర్చోబెడుతున్నారన్నారు. కస్టమర్‌లు ఆఫీస్ కొచ్చి మాట్లాడాలని వారిని ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ ఆఫీస్‌కి తీసుకెళ్లి వారి నిర్బంధించి మీ మెడలో ఉన్న పుస్తెల అమ్మి కంతు కట్టండని బలవంత పెడుతూ అర్ధరాత్రి వరకు ఆఫీసుల్లో నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. కొంత మంది కస్టమర్లు సిబ్బంది ఆఫీసులో కొట్టుకునే సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం వారి డబ్బులు వసూలు తప్ప ఇలా నిర్బంధించడం, ప్రత్యక్ష దాడులు చేయడం, నిబంధనలకు వ్యతిరేకమన్నారు. ఇలాంటి ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం క్రిమినల్ కేసు నమోదు చేసి ఆ కంపెనీ సీజ్ చేయాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర ఆఫీస్ బేరర్స్ పావని, రేణుక, శైలజ, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు, నగర నాయకులు కృష్ణ, చంటి, రాజ్ కుమార్, శీను, మధు, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు అభి, అశోక్, ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ బాధితులు డేవిడ్, ధనలక్ష్మి, కరిముల్లా, చాకలి పురేంద్ర పాల్గొన్నారు.

## నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురించే పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర - ఆదోని రూరల్: సమాజంలో జరుగుతున్న అవినీతి వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ ప్రజా శ్రేయస్సు కోసం నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురించే పత్రిక విశాలాంధ్ర అంటూ టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె నివాసంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఉన్న పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు కలం రూపంలో వార్తలు ప్రచురితం చేసేందుకు విశాలాంధ్ర పత్రికను 1952 జూన్ 22న స్థాపించడం జరిగిందని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల జాతీయ అభిమానాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ప్రజాభిమానం విశేషంగా పొందిన విశాలాంధ్ర పేరుతో దిన పత్రికలు నిర్వహించాలని కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఆనాడు సొసైటీల చట్టం కింద రిజిస్టర్ అయిన విశాలాంధ్ర విజ్ఞాన సమితి పట్ల సుదీర్ఘంగా క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మురళి, కాబట్టి మాజీ సర్పంచ్ మాధవ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**అధికారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న కృష్ణమ్మ:** 2025 నూతన సంవత్సర సందర్భంగా సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్, సీఐలు, ఎస్సైలు, వివిధ శాఖల గెజిటెడ్ అధికారులకు టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి గుడిసె ఆధికృష్ణమ్మ శాలువా కప్పి, పూల బోక్కిలు అందజేసి ప్రత్యేకంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## దళితుల భూముల జోలికి వస్తే ఖబడ్దార్..

విశాలాంధ్ర - ఓర్వకల్లు : దళితుల భూముల జోలికి వస్తే ఖబడ్దార్ అని సీపీఐ మండల కార్యదర్శి రమేష్, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్‌లు అన్నారు. సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్ విద్యాసాగర్‌కి వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వాకె మాట్లాడుతూ మండలంలోని బ్రాహ్మణపల్లి సర్వేనెంబర్ 303 బీ1 ఎకరా 50 సెంట్లు భూమి ఒక దళిత వర్గానికి చెందినటువంటి సాలమ్మ అనే రైతు భూమి ఉందన్నారు. చాలా కాలం నుంచి వీళ్లు సాగు చేసుకుంటూ జీవనము సాగిస్తూ ఉన్నారన్నారు. ఇటీవల కొంతమంది అగ్రవర్ణాల కులానికి చెందిన వాళ్ళు ఆ పొలాన్ని ఆక్రమించాలని చూస్తూ అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే వారిపైన చర్యలు తీసుకోవాలని, ఓర్వకల్లు మండలం రోజురోజుకు ఒక పరిశ్రమ హబ్బుగా డెవలప్ అవుతున్న తరుణంలో ఓర్వకల్లు మండలంలో కొంతమంది దళారులు విచ్చలవిడిగా దళితుల భూముల ఆక్రమించుకుంటూ దళితులను భయభ్రాంతులకు గురిచేస్తూన్నారు. తక్షణమే ఎవరైతే ఆ రైతును ఇబ్బందిలకు గురిచేస్తున్నారో వారిపైన చర్యలు తీసుకొని, సాగు చేసుకుంటున్న రైతు కుటుంబాన్ని ఆదుకొని భూములను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సాలమ్మ, మరియమ్మ, ఎల్లశేఖరు, రామాంజనేయులు, రవి, స్వామి, దాసు తదితరులు పాల్గొన్నారు.

## అంధత్వం రాకుండా అరికట్టొచ్చు

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కంటి సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేసుకుంటే కంటి చూపు కోల్పోవడం వంటి తీవ్ర సమస్యలు రాకుండా జాగ్రత్త పడవచ్చని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. నగరంలోని గాయత్రీ ఎస్టేట్లో ఉన్న శ్రీ గురుదత్త పాలి క్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో గతంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న జర్నలిస్టులకు, సమాచార శాఖకు చెందిన కొంత మంది సిబ్బందికి ఉచితంగా కంటి అద్దాలను ఆయన పంపిణీ చేశారు. సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానమ్ అనే సూక్తి ఉందని, మనిషి శరీరంలోని అన్ని అవయవాల కంటే కంటి ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని చెప్పారు. కంటి జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందాలని ఆయన సూచించారు. తన సామాజిక సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరిన్ని కొనసాగిస్తానని ఆయన వెల్లడించారు.

## పాఠశాల గుర్తింపు రద్దు చేసి, కేసులు నమోదు చేయాలి

విశాలాంధ్ర - ఆదోని క్రైం: పట్టణంలోని భాష్యం పాఠశాల గుర్తింపును రద్దుచేసి యాజమా న్యపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, జిల్లా సమితి సభ్యుడు లింగప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్నట శిరీష అనే మేడం నిన్నటి రోజున విద్యార్థులను కట్టెతో పశువును బాదినట్టు బాదరని, విద్యార్థి తల్లిదండ్రులు వచ్చి ప్రశ్నించగా యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులను మభ్యపెడుతూ మీ విద్యార్థుల కోసమే కదా మీ విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలనే కదా అని మైండ్ వాష్ చేస్తున్నారు అని వారు తెలిపారు. విద్యా అధికారుల లోపమే అని వారు ప్రైవేట్ కార్పొరేట్ శక్తుల ముడుపుల మాయలో ఉన్నారనీ విమర్శించారు. కావున ఇప్పటికైనా విద్యాధికారులు స్పందించి పాఠశాలను సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వీర, హుసేని, రవి బస్నీ తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణాల మంజూరుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారణ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రైతులకు పంట రుణాలు మంజూరుకు సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంకేతిక సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి వివిధ రకాల రుణాల మంజూరు కోసం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ను నిర్ధారించడం జరిగిందన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వరి పంటకు ఎకరాకు ఖరీఫ్‌లో రూ.46 వేల నుంచి రూ.50 వేలు, జొన్న పంటకు ఎకరాకు రూ.22 వేల నుండి రూ.24 వేలు, కొర్ర పంటకు ఎకరాకు రూ.15 వేల నుండి రూ.16 వేలు, కంది పంటకు ఎకరాకు రూ.22 వేల నుండి రూ. 25 వేలు, పెసర పంటకు ఎకరాకు రూ.22వేల నుండి రూ.24 వేలు నిర్ధారించడం జరిగిందన్నారు. వేరుశనగ, పసుపు, మామిడి, జామకాయ, సపోటా, టమాటో, రోజా పూలు, కనకాంబరాలు, పుచ్చకాయ, ఆముదం, దానిమ్మ, బంతిపూలు తదితర ఉద్యాన పంటలకు కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు జెర్సీ ఆవులు, గేదెలు, పొట్టేళ్ళు, పౌల్ట్రీ లకు సంబంధించిన దాణా, వెటర్నరీ ఎయిడ్‌కి, మత్స్యశాఖకు సంబంధించి ఫిష్ కల్చర్, నెట్స్ తదితర అంశాలకు సంబంధించి సేల్ జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ ఆధ్వర్యంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించడం జరిగిందన్నారు. పెంచిన వివరాల ప్రతిపాదనలను రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ కి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కేడీసీసీ బ్యాంక్ సీఈఓను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ విజయ్ కుమార్, డీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ రామాంజనేయులు, ఎల్డీఎం రామచంద్ర రావు, నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు...

## ప్రతి ఒక్కరూ కళలను, కళాకారులను ప్రోత్సహించాలి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు:** సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింప చేసే కలలను, కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవం, నృత్య జ్యోతి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని కర్నూల్ నగర శివారులో ఉన్న ఇండస్ స్కూల్ నందు మాంటిసోరి విద్యాసంస్థల సహకారంతో, ఏర్పాటుచేసిన సౌత్ ఏసియా పీస్ కాన్ఫరెన్స్ ఇంటర్నేషనల్ యూత్ కల్చరల్ ఫెస్టివల్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సౌత్ ఏసియా పీస్ కాన్ఫరెన్స్, యూత్ కల్చరల్ ఫెస్టివల్‌ను 10, 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మన దేశానికి చెందిన 20 రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, కళాకారులతో పాటు ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, నేపాల్, శ్రీలంక దేశాలకు చెందిన కళాకారులు హాజరు కానున్నారని టీజీ వెంకటేష్ తెలిపారు. ఇన్ని రాష్ట్రాల కళాకారులు, ఇన్ని దేశాల ప్రముఖులు కర్నూలుకు రావడం ఇదే మొదటిసారి అని, ఇటువంటి కార్యక్రమాన్ని కర్నూలు నగర ప్రజలందరూ ఆస్వాదిస్తూ, అభినందించాలని టీజీ వెంకటేష్ కోరారు. తొలిసారిగా కర్నూలులో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి ఆశీర్వదించాలని ఆయన కోరారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 04, జనవరి 2025

## కాంగ్రెస్ పార్టీలో చేరిన టీడీపీ, వైసీపీ నాయకులు

**విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూల్:** సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన టీడీపీ, వైసీపీలకు చెందిన సుమారు 15 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి.మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశాడు. మురళీకృష్ణ, సుధాకర్ బాబు కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు పోలకల్ గ్రామానికి చెందిన పల్ దొడ్డి నాగప్ప, వాసు, మద్ది, భాస్కర్, రాముడు, గూడూరు లోకేష్, కోటి, నాగేంద్ర, పందు, కృష్ణ, ఎర్రమల్ల, సుంకన్న, తిరుమలేష్, చిన్న వెంకటేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేశాడు. కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయాలనే ఉద్దేశంతో పార్టీ కోసం కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన శాశ్వత పనులకు ఆకర్షితులమై మురళీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్సీ బజారన్న, టీఎన్టీయూసీ అధ్యక్షులు బి.బతుకన్న, సయ్యద్ నవీద్, ఇ.లాజరస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ వైద్య పరిశోధనా సంస్థకు కేఎంసీ విద్యార్థులు ఎంపిక

**విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల:** భారతీయ వైద్య పరిశోధన సంస్థకు కర్నూలు మెడికల్ కాలేజీ ఫార్మకాలజీ నుండి 5 ప్రాజెక్ట్‌లు ఎంపిక అయ్యాయి. ఈ సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్య వ్యవస్థలో అధునాతన మార్పులు, అభివృద్ధి కొరకు ఢిల్లీలోని భారతీయ వైద్య పరిశోధన దేశ వ్యాప్తంగా వున్న మెడికల్ కాలేజీలలోని వైద్య విద్యార్థుల నుండి పరిశోధన ప్రతిపాదనలు స్వీకరించగా కర్నూల్ మెడికల్ కాలేజీలోని ఫార్మకాలజీ ఒక్క విభాగానికి చెందిన ఐదుగురు విద్యార్థుల పరిశోధన ప్రతి పాదనలకు ఐసీఎమ్మార్ అనుమతి లభించడం పట్ల ఫార్మకాలజీ విద్యార్థులను వారిని ప్రోత్సహించిన ఫార్మకాలజి విభాగాధిపతి డాక్టర్ రాజేష్ ను శుక్రవారం అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా.కె.చిట్టి నరసమ్మ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైద్య విభాగంలో పరిశోధన నిమిత్తం ఐ.సి.యం.ఆర్ ప్రతిష్ఠాత్మకంగా ఎంపిక చేస్తుంది అని తెలిపారు. ఫార్మకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా.రాజేష్ మాట్లాడుతూ తమ విభాగానికి చెందిన వైద్య విద్యార్థుల ఐదు పరిశోధనా ప్రాజెక్టు లకు ఐ సి ఎం ఆర్ నుండి అనుమతి లభించడం సంతోషంగా వుంది అని అన్నారు. పరిశోధనకి ఎంపిక కాబడిన వైద్య విద్యార్థులు సాహితి, సుమేధ, శివసోకిత్, మొహ్మద్ అఖిత్, పీజీ డా.జ్యోత్స్నను ప్రిన్సిపాల్ అభినందించారు.

### పౌర సరఫరాల పాయింట్ తనిఖీ

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు:** ఎమ్మిగనూరు పౌర సరఫరాల గొదం పాయింటను శుక్రవారం ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వ, రికార్డ్స్, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం కార్డ్ లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఏలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సబ్ కలెక్టర్ సూచించారు. తహశీల్దారు శేషఫణి, పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దారు మహేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మన్న రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సావిత్రిబాయి పూలే సేవలు ఎనలేనివి

**విశాలాంధ్ర- కర్నూలు సిటీ:** మహిళల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు ఎనలేనివని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు కొనియాడారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రీ బాయి పూలే 195వ జయంతి జయంతి వేడుకల్లో భాగంగా సావిత్రీ బాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంపీ అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లాగానే ఆంధ్రప్రదేశ్ లో కూడా సావిత్రీ బాయి పూలే జయంతి ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించేలా ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### ఘన చరిత్ర కలిగిన సంఘం ఎస్టీయూ

**విశాలాంధ్ర - ఆదోని రూరల్:** ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న సంఘముగా ఎస్టీయూకు ఘన చరిత్ర కలిగి ఉందని ఎమ్మెల్సీ బీటి.నాయుడు అన్నారు. శుక్రవారం బీటీ నాయుడు నివాసంలో ఎస్టీయు ఉపాధ్యాయులు ఆయన చేతుల మీదుగా 2025 నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. సమ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని, విద్యార్థులను భావితరాల పౌరులుగా తీర్చిదిద్దలాని, విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాలన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ముందుకు తీసుకెళ్తామని, మునిసిపల్ ఉపాధ్యాయ సమస్యలపై, ఉపాధ్యాయులుకు రావాల్సిన బకాయిలపై విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నాగేంద్రప్ప, రమేష్ నాయుడు, వీరచంద్ర యాదవ్, లోక్య నాయక్, ప్రహ్లాద, శ్రీనివాసులు, నరసింహులు, నాగప్రసాద్, రవి, భీమరాజు, సుధాకర్, ఉరుకుందప్ప, అల్తాఫ్, శ్రీరాములు, నారాయణ, జ్యోతి మూర్తి, ఎస్టీయూ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

**విశాలాంధ్ర - ఆస్పరి:** మండల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో మండల విద్యాశాఖ అధికారి తిరుమల రావు, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు నాగరాజు, జిల్లా అసోసియేటివ్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజిని, మురళి కృష్ణ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ముందుగా ఎంఈఓ-2 తిరుమలరావును ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాశాఖలో తలెత్తుతున్న సమస్యలు పరిష్కరించడంలో ఎస్టీయూ ఎల్లప్పుడు ముందు ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమ ధ్యేయంగా ఎస్టీయూ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు కాశీ విశ్వనాథ శాస్త్రి, జ్యోతి మూర్తి, లక్ష్మీపతి, బసవరాజు, నాగరాజు, శ్రీరంగ, ఉరుకుందు, లక్ష్మీనారాయణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించడం హర్షణీయం

**విశాలాంధ్ర - పాములపాడు:** ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు చేతుల మీదుగా ప్రారంభించడం ప్రశ్నించదగ్గ విషయమని ప్రభుత్వ టెలికాం సలహా కమిటీ మెంబర్ నందికొట్కూరు నియోజవర్గ యువ నాయకులు కురువ రమేష్ శుక్రవారం పాముల పాడులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ జనవరి-4వ తేదీన నుంచి ప్రారంభించాలని కూటమి సర్కారు నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని 475 కాలేజీల్లో జరిగే ఈ మధ్యాహ్న భోజన కార్యక్రమం కోసం సర్కారు రూ.115 కోట్లు కేటాయించిందన్నారు. పేద విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని ఆయన తెలిపారు.

## నీటి వనరుల ఆక్రమణలను తొలగించాలి : జాయింట్ కలెక్టర్

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** జిల్లాలో నీటి వనరుల ఆక్రమణలను తొలగించే చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య,నీటి వనరులు మరియు చెరువు భూముల జిల్లాస్థాయి పరిరక్షణ కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నీటి వనరులు మరియు చెరువుల భూముల జిల్లాస్థాయి పరిరక్షణ కమిటీ తో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య సమీక్షా సమావేశం నిర్వహించారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులు, వాటి సమీపంలో ఎలాంటి ఆక్రమణలు ఉన్నా, వాటిపై సర్వే చేసి పూర్తి వివరాలను ఈనెల 5వ తారీఖు లోపల సమర్పించాలని కమిటీని ఆదేశించారు. అక్కడ నిర్మాణాలు తాత్కాలికముగా ఉన్నదా? పర్మినెంట్ గా ఉండేలా నిర్మించారా అన్న విషయాలను సేకరించాలన్నారు. రెవెన్యూ వారు, ఇరిగేషన్ డిపార్ట్మెంట్, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని పరిశీలించిన విషయాలను ఈనెల 5వ తారీఖు లోపల రిపోర్ట్స్ ఇవ్వవలసిందిగా ఆదేశించారు. మున్సిపాలిటీల్లో ఆక్రమణలపై నివేదిక ఇవ్వాలని జేసీ అధికారులను ఆదేశించారు. నీటి వనరుల సమీపంలో బఫర్ జోన్ గుర్తించి ఆ ప్రాంతాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా అరికట్ట వచ్చునని కమిటీకి తెలియజేశారు. జిల్లాలోని పట్టణ ప్రాంతంలో పరిశీలించే సమయంలో ఆర్డిఓ, తహశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, జలవనరుల శాఖ అధికారులు, డీపీఓ సంబంధిత అధికారులందరూ సమన్వయంతో సర్వే నిర్వహించాలన్నారు. డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డిపిఓ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఇరిగేషన్ డిపార్ట్మెంట్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్న అహోబిలేసుని పార్వేట ఉత్సవాలు

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో పారువేట ఉత్సవాలు ఈనెల 15న బుధవారం కనుమ రోజుతో అంగరంగ వైభవంగా ప్రారంభమవుతాయి. ఎగువ అహోబిలం లో వెలసిన శ్రీ జ్వాల నరసింహ స్వామి, దిగువ అహోబిలంలో వెలిసిన శ్రీ ప్రహ్లాద వరద స్వాములు పారువేట ఉత్సవంలో భాగంగా మూడు మండలాల్లో అనగా ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, రుద్రవరం మండలాల్లో 45 రోజులపాటు 33 గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లోని తెలుపుల వద్ద ఆసీనులై మార్చి మాసంలో బ్రహ్మోత్సవాలలో జరిగే తమ ఉత్సవాలకు స్వయంగా భక్తులను ఆహ్వానించేందుకు సంక్రాంతి పండుగ రోజు కొండ దిగి గ్రామాలకు స్వయంగా వేంచేయనున్నారు. పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న బుధవారం పారువేట ఉత్సవాలు ప్రారంభమై ఉత్సవ పల్లకి రాత్రి బాచేపల్లె గ్రామం చేరుకుంటుంది. ఈనెల 17వ తేదీన శుక్రవారం కొండంపల్లి, ఆర్.కృష్ణాపురం, 19న ఆదివారం కోట కందుకూరు, 20న రాత్రి మర్రిపల్లె, 21న రాత్రి యాదవాడ, 22న రాత్రి రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి అహోబిలేసుని ఉత్సవ పల్లకి చేరుకుంటుంది. అక్కడ మూడు రోజులు పాటు పూజలు అందుకొని 25న రాత్రి తిమ్మనపల్లె గ్రామం చేరుకుంటుంది. 26 సాయంత్రం నరసాపురం, 27న రాత్రి ముత్తలూరు, 28న రాత్రి నల్లవాగుపల్లె, 29న రాత్రి ఆళ్లగడ్డ మండలంలోని బాచ్చాపురం మెట్ట(చదల్లదిన్నే) అదే రోజు రాత్రి బాచ్చాపురం, 30న రాత్రి నరసరావుపేట (మిద్దెలు), అదే రోజు రాత్రి ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పి. నాగిరెడ్డిపల్లె గ్రామానికి ఉత్సవ పల్లకి చేరుకుంటుంది. 31వ తేదీ రాత్రి శుక్రవారం పడకండ్ల గ్రామం చేరుకొని అక్కడ రెండు రోజులు పాటు పూజలు అందుకున్న స్వామి పల్లకి ఫిబ్రవరి 2న శనివారం ఉదయం మున్సిపాలిటీ కేంద్రమైన ఆళ్లగడ్డ గ్రామం చేరుకుంటుంది. ఆళ్లగడ్డ పట్టణంలోని పలు వీధుల్లో 5 రోజుల పాటు పూజలు అందుకున్న స్వామి పల్లకి ఫిబ్రవరి 7న శుక్రవారం ఎస్.లింగందిన్నె గ్రామం చేరుకుంటుంది. 8న శనివారం ఉదయం ఉయ్యాలవాడ మండలం సర్వాయి పల్లె గ్రామం చేరుకొని అక్కడ గ్రామ పొలాల్లో అలనాడు రాజుల కాలంలో ఏర్పాటు చేసిన కోనేరు జలాలతో స్వామిని అభిషేకిస్తారు. అక్కడి నుండి 10న ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, అదే రోజు పెద్దచింతకుంట, 11న దేవరాయపురం, అదే రోజు రాత్రి గూబ గుండం గ్రామం చేరుకుంటుంది. 12న బుధవారం రాత్రి జంబులదిన్నె, 13న రాత్రి రుద్రవరం మండలంలోని మందలూరు గ్రామానికి అహోబిలేసుని ఉత్సవ పల్లకి చేరుకుంటుంది. అక్కడినుండి 14న నక్కలదిన్నే, 15 న చందలూరు, 16న చిలకలూరు, 17న తిప్పారెడ్డి పల్లె, 18న టి.లింగం దిన్నె, 20న ఆర్. నాగులవరం, 21న తువ్వపల్లె, 22న సాయంత్రం అహోబిలేసుని ఉత్సవ పల్లకి మండల కేంద్రమైన రుద్రవరం గ్రామం చేరుకుంటుంది. స్వామి పల్లకి 28న శుక్రవారం ఉదయం అహోబిల క్షేత్రం చేరుకుంటుంది. దీంతో పారువేట ఉత్సవం ముగుస్తుంది.. పారువేట ఉత్సవం అనంతరం అహోబిలంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

## బనవాసి గురుకులంలో చదివే విద్యార్థినిలకు రక్షణ కల్పించాలి

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు:** మండల పరిధిలోని బనవాసి గురుకులలో చదివే బాలికలకు రక్షణ కల్పించాలని నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకులు కె.జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకులు కె.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బాలికలపై అఘాయిత్యాలు ఎక్కువ అయ్యాయాని విమర్శించారు. బనవాసి బాలికల గురుకుల కళాశాలలో బాలికల పట్ల లైబ్రేరియన్, మరికొంత మంది అధ్యాపకులు లైంగిక వేధింపులకు పాల్పడడం బాధాకరమని, విద్యార్థినులు వారి ఆవేదనను వ్యక్తం చేస్తుంటే చాలా బాధనిపిస్తుందని తెలిపారు. ఎవరైతే లైంగిక వేధింపులకు పాల్పడ్డారో వారిని అరెస్ట్ చేయడం జరిగిందని, విద్యార్థినిలు ఆరోపిస్తున్న ఫిజిక్స్ లెక్చర్ శ్రీధర్‌ను అరెస్ట్ చేయాలన్నారు. బాలికలకు రక్షణగా ఉండే సీసీ కెమెరాలను రాత్రి పూట ఆఫ్ చేస్తున్నట్లు విద్యార్థినిలు చెప్పారని, వాటిపై చర్యలు తీసుకొని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, ఎంపీపీ జి.కేశన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్య, వైసీపీ మైనార్టీ నాయకులు రియాజ్ అహ్మద్, మాజీ శాప్ నెట్ వర్క్ చైర్మన్ వెంకటేశ్వర్లు, మాజీ వైడబ్ల్యూసీ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి విరమణ సహజం

**విశాలాంధ్ర - జిల్లా పరిషత్, కర్నూలు:** కర్నూలు ఈఓఆర్డీ అనురాధమ్మ సేవలు అభినందనీయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కొనియాడారు. 2024 డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ పొందిన అనురాధమ్మకు శుక్రవారం కర్నూలు ఎంపీపీ హాల్లో ఎంపీడీవో జి.రఘునాథ్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కోడుమూరు టీడీపీ ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, జడ్పీ సీఈఓ జి.నాసర్ రెడ్డి, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన ఉద్యోగ ప్రస్థానం ఒకే చోట ప్రారంభమై అదే చోట విరమణ పొందడం గర్వించదగ్గ, హర్షించదగ్గ విషయం అన్నారు. ఆమె శేష జీవితం ప్రశాంతంగా గడపాలని కోరారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో అనురాధ తన 31 సంవత్సరాల ఉద్యోగ ప్రస్థానంలో ఎటువంటి సమస్యలు వచ్చినా సానుకూలంగా స్పందిస్తూ ముందుకు సాగారని అన్నారు.అనంతరం అనురాధమ్మ దంపతులను ఎమ్మెల్యే, జడ్పీ సీఈఓ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది దృశ్యాలువ, పూలమాలలతో సన్మానించారు. అంతకుముందు డీపీవో భాస్కర్, కర్నూలు మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో హనుమంతరావు, పీఆర్డీఈ కర్రన్న, విశ్రాంత జడ్పీ సీఈవో జైపాల్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సహచర ఉద్యోగులు వారి వారితో ఉన్న అనుబంధాలను పంచుకున్నారు.

## విద్యార్థులకు అవగాహన సదస్సు : వైస్ ఛాన్సలర్

**విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ :** విద్యార్థిదశ నుండే సమాజిక బాధ్యతను అలవరచు కోవాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్ ఆచార్య ఎన్టీకే నాయక్ పిలుపునిచ్చారు. రాయలసీమ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం వారు శుక్రవారం బహిరంగ ప్రదేశంలో భారీ పరిశుభ్రతాకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్య క్రమంలో భాగంగా రాయలసీమ విశ్వ విద్యాలయంలోని ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థులు స్థానిక కర్నూలు రైల్వేస్టేషన్లో పరిశుభ్రతాకార్యమాన్ని చేపట్టడం సంతోష కరమన్నారు. పచ్చదనంతోపాటు, పరిశుభ్రతను కాపాడుకున్నపుడే భవిష్యత్తరాలు భద్రంగా మనుగడ సాగించ గలవన్నారు. అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశుభ్రతకు ఎంతో పెద్ద పీట వేస్తున్నాయన్నారు. తమవంతుగా వర్సిటీతో పాటుగా అనుబంధ కళాశాలల ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత కార్య క్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎన్టీకే నాయక్ వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వలసిన అవసరాన్ని ప్రతి పౌరుడూ తెలుసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు పిలుపునిచ్చారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డితోపాటు వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

### ఏపీ చేనేత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర - కోడుమూరు :** ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం క్యాలెండర్ ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుగుడే మాధవస్వామి చేనేత కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక నాగార్జున స్కూల్ మైదానం వద్ద ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో 2025వ నూతన సంవత్సరం చేనేత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు బుగుడే మాధవస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం విస్మరించిందన్నారు. చేనేత కార్మికులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, చేనేత కార్మికులకు చేనేత పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు సోమమోహన్, మండల అధ్యక్షుడు ఎస్ నరసింహులు, కార్యదర్శి బాషా, చేనేత కార్మికులు మాధవి, సరస్వతి, లక్ష్మీదేవి, మధు, తోటయ్య, శ్రీరాములు, పుల్లయ్య, నాగేష్, రాజు, వలి, భాస్కర్, శ్రీనివాసులు, ఎం.లక్ష్మీనారాయణ, శంకర్ పాల్గొన్నారు

### పదో తరగతి స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు:** స్థానిక ఎస్టీయూ కార్యాలయం లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 10వ తరగతిలో తక్కువ సమయంలో అన్ని సబ్జెక్టుల యందు మంచి మార్కులు సాధించడానికి స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వెనకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి ఈ మెటీరియల్ ఎంతగానో సహకరిస్తుందన్నారు. ఈ మెటీరియల్ విద్యార్థులందరికి చాలా ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ప్రసన్నరాజు, బసవరాజు, చంద్రశేఖర్, ఎల్లప్ప, నాగరాజు, రామచంద్ర, ఎర్రి స్వామి, సిద్ధ లింగమూర్తి, వీరేష్, రంగనాథ్, నారాయణరావు, చిన్న తిమ్మన్న, రాముడు పాల్గొన్నారు.

### ఫ్రెండ్లీ ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపిన సీపీఐ నాయకులు

**విశాలాంధ్ర - పెద్దకడబూరు :** మండల కేంద్రమైన పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డికి శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎస్ఐ కు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సీనియర్ నాయకులు ఇస్మాయిల్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలపై మంచి అవగాహన కలిగిన వ్యక్తి ఎస్ఐ అన్నారు. రాజకీయ నాయకుల మాటలకు తలొగ్గకుండా, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తున్నారని కొనియాడారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో విచ్చలవిడిగా కర్ణాటక మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, నాయకులు తిక్కన్న, దస్తగిరి, డోలు హనుమంతు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యా కమిటీ ఛైర్మన్‌లకు, వైస్ ఛైర్మన్‌లకు శిక్షణ

**విశాలాంధ్ర - కోవెలకుంట్ల :** మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసీ స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ లకు, వైస్ చైర్మన్ లకుస్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఈఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, మధ్యాహ్న భోజనం నాణ్యత, బడికిరాని పిల్లల పట్ల విద్యా కమిటీ బాధ్యతలు గురించి ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

### సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** పట్టణంలోని ఎస్పీజి హైస్కూల్ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ లో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముస్తాక్ మౌలానా మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, పాఠశాలలకు కావల్సిన అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, ఇటువంటి సైన్స్ ఫేర్ వల్ల వారిలో విజ్ఞానం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు డిఈఓతో కలసి బహుమతులను అందజేశారు.

### రాయలసీమ యుద్ధ గర్జన జయప్రదం చేయండి

**విశాలాంధ్ర - నంద్యాల అర్బన్:** కర్నూలు ఎస్టిబిసి కళాశాల ఆవరణంలో ఫిబ్రవరి 23న జరిగే రాయలసీమ మాల మహానాడు యుద్ధ గర్జనను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మేకల లింగస్వామి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా జరగవలసిన ఆవశ్యకత ఉన్నదని ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు సిద్ధం కావడం బాధాకరమన్నారు.